నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 17 మే 2025 | HYDERABAD

నేడు ఎస్‌పీఆర్ హిల్స్ రిజర్వాయర్ ప్రారంభం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

సిటీబ్యూరో, మే16, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లోని ఎస్‌పీఆర్ హిల్స్ ప్రజలు పడుతున్న నీటి కష్టాల నేపథ్యంలో ఆ ప్రాంతంలో నిర్మించిన వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించాలని 'బీఆర్ఎస్ నిర్మించింది.. కాంగ్రెస్ విస్మరించింది' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురించిన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. నేడు ఎస్‌పీఆర్ హిల్స్‌లోని 3ఎంఎల్ రిజర్వాయర్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.

శుక్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌ను మిస్‌వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించగా వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

మెట్రో బాదుడు షురూ..

రూ. 12 నుంచి 75 వరకు పెంపు.. పార్కింగ్‌కు రోజుకు రూ.40

నేటి నుంచి అమలు

టాయిలెట్ వెళ్లాలంటే రూ.5
రాయితీ కార్డులన్నీ రద్దు
వ్యతిరేకిస్తున్న ప్రయాణికులు
అదనపు బోగీలు పెంచకుండా
ప్రయాణికులపై భారం
కేసీఆర్ హయాంలో పెరగని ధరలు

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ) : నవ్వి పోదురుగాక నాకేంటి సిగ్గు అన్న చందంగా మెట్రో అధికారులు వ్యవహరిస్తున్నారు. నష్టాల సాకు చూపి టికెట్ ధరలు పెంచేశారు. కనిష్ఠంగా రూ.2, గరిష్ఠంగా రూ.16 వరకు చార్జీలు పెంచామని ఎల్ అండ్ టీ ప్రకటించింది. శనివారం నుంచి ఈ ధరలు అందుబాటులోకి వచ్చాయి. అయితే సౌకర్యాల మాటేమిటీ అని ప్రయాణికులు అధికారులను నిలదీస్తున్నారు. సాంకేతిక సమస్యలతో మెట్రో రైలు ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో కూడా తెలియడం లేదని.. అరగంటపైగా రైలు నిలిచిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెట్రో స్టేషన్లకు సులభంగా చేరుకునేలా ప్రత్యేకంగా ఎలాంటి రవాణా కనెక్టివిటీ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. ప్రయాణికులతో ప్రతి రోజు మెట్రో రైలు రద్దీని తలపిస్తుంది. అదనపు బోగీలు పెంచాల్సింది పోయి.. టికెట్ ధరలు పెంచడంపై మెట్రో అధికారులు దృష్టి సారించడం ఏంటని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. అదనపు బోగీలు పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నా.. పట్టించుకోకుండా టికెట్ ధరలు పెంచి అధికారులు చేతులు దులిపేసుకున్నారు.

ప్రయాణికుడి జేబు చిల్లు..!

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రాయితీలు 10 శాతం, 5 శాతం రాయితీ ఉండేది. కానీ ఇప్పుడు కార్డులన్నిటిని రద్దు చేశారు. మెట్రో హాలిడే కార్డు అంటే రూ.50 తో రీచార్జ్ చేసుకుంటే ఒక్క రోజంతా ప్రయాణం చేసే సౌకర్యాన్ని సైతం రద్దు చేశారు. ఎటొచ్చి ప్రయణికుడు ఇప్పుడు మెట్రోలో ప్రయాణించాలంటే జేబుకు చిల్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. రూ. 10 ఉంటే టికెట్ రూ.12 అయింది. రూ.65 టికెట్ 75 అయింది.

కేసీఆర్ పాలనలో పెరగని చార్జీలు

కరోనా సమయంలో మెట్రో సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలోనూ అధికారులు టికెట్ ధరలు పెంచడానికి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరింది. కానీ టికెట్ల పెంపునకు అప్పటి ప్రభుత్వం అంగీకరించలేదు. సెప్టెంబర్ 5, 2022లో ఎఫ్ఎఫ్‌సీ కమిటీ నియమించింది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి అధ్యక్ష తన హైదరాబాద్ ప్రజా అభిప్రాయాలను సేకరించిన విషయం తెలిసిందే. కానీ కేసీఆర్ హయాంలో ఎప్పుడూ టికెట్ ధరలు పెరగలేదు.

పార్కింగ్ దందా..

మెట్రో ప్రయాణం చేయాలంటే టికెట్ ధరలతో పాటు పార్కింగ్ ధరలను కూడా చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. నెలకు రూ. 12 వందల నుంచి రెండు వేల వరకు చార్జీ అవుతుందని మెట్రో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఐటీ ఉద్యోగి ఈ చివర నుంచి ఆ చివరకు వెళ్లాలంటే నెలకు టికెట్ ధరలు రూ.75 చొప్పున రోజుకు 150 అవుతుంది. 20 రోజులకు రూ.3వేల వరకు ప్రయాణికుడికి చిల్లు పడుతున్నది. దీంతో పాటు అదనంగా పార్కింగ్‌కు రూ.2వేలు. మళ్లీ స్టేషన్ చేరాక అక్కడి నుంచి ఆఫీస్‌కు చేరుకోవడానికి బుకింగ్ బైక్, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆ ధరలు అదనంగా పడుతున్నాయి

టాయిలెట్‌కు డబ్బులు ..

మెట్రో స్టేషన్లలో టాయిలెట్స్ వినియోగించుకోవాలన్నా డబ్బులు చెల్లించాల్సిందే. సాధారణంగా ప్రయాణికుల స్టేషన్లకు టాయిలెట్స్ ఉచితంగా ఉంటాయి. కానీ మెట్రో స్టేషన్లలో మాత్రం టాయిలెట్ వినియోగించుకోవాలంటే రూ.5 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. రూ.2 వసూలు చేయాల్సింది.. రూ.5 తీసుకుంటున్నారని తెలిపారు. ప్రయాణికులకు కావాల్సిన వసతులు మెట్రో అధికారులు కల్పించలేదు. కానీ టికెట్ ధరలు పెంచి అడ్డగోలు దోపిడీకి మెట్రో సిద్ధమైందని వాపోతున్నారు.

మందుబాబులూ బహు పరాక్

- నగరంలో నకిలీ మద్యం విక్రయం
- ఆబ్కారీ దాడులతో వెలుగులోకి..
- కల్తీ మద్యంతో ఆరోగ్యానికి ముప్పంటున్న వైద్యనిపుణులు

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): నగరంలో జోరుగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న ఒక బార్ యాజమాన్యం నకిలీ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన విషయం మరవక ముందే తాజాగా రాజేంద్రనగర్, కాటేదాన్‌లో మరో నకిలీ మద్యం సరఫరా ముఠా గుట్టును ఆబ్కారీ పోలీసులు రట్టు చేసిన విషయం తెలిసిందే. ధనార్జనే ధ్యేయంగా నగరంలో కొందరు బార్ల నిర్వాహకులు ఇలాంటి కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు నగరంలోని ట్రూప్స్ బార్ ఘటనతో మరోసారి రుజువైంది. ఈ తరహా కల్తీ మద్యం విక్రయాలు హైదరాబాద్,

IIలో

నకిలీ ముఠా గుట్టురట్టు

ఓల్డ్‌డేట్ బాండ్ పేపర్లతో నకిలీ పత్రాలు
571 డాక్యుమెంట్లలో 280 నకిలీ సేల్‌డీడ్స్

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మున్సిపల్ సిబ్బంది సహకారంతో బర్త్ సర్టిఫికెట్లు

IIలో

సీసీ కెమెరాలు తొలగించి.. గేటుకు తాళం వేసి..

నమస్తే కథనాలపై స్పందించిన రెవెన్యూ అధికారులు

రూ.300 కోట్ల విలువైన స్థలం స్వాధీనం
గేటుకు తాళాలు వేసిన రెవెన్యూసిబ్బంది

బంజారాహిల్స్,మే 16: నగరం నడిబొడ్డున రూ.300 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలపై 'కబ్జా కోసం..విశ్వ ప్రయత్నాలు..' పేరుతో ప్రచురితమైన నమస్తే తెలంగాణ కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నెంబర్ 403/పీ లోకి వచ్చే టీఎస్ నెంబర్ 111, బ్లాక్- హెచ్, వార్డు-10లో 5 ఎకరాల స్థలాన్ని కాజేసేందుకు బోగస్‌పత్రాలతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు. 5ఎకరాల స్థలం బయట ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఉండగా లోపలివైపు సీసీ కెమెరాలు, వేటకుక్కలతో ప్రైవేటు వ్యక్తులు నిఘా పెట్టిన వ్యవహారంపై శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టి సారించారు. ఎట్టి పరిస్థితిలో ప్రైవేటు వ్యక్తులు లోనికి వెళ్లకుండా చూడాలని, స్థలంపై నిరంతరం నిఘా పెట్టాలని షేక్‌పేట్ మండల తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాలతో షేక్‌పేట మండల రెవెన్యూ ఆర్ ఐలు అనిరుధ్, భానుతో పాటు ఇతర సిబ్బంది ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలన్నింటినీ తొలగించారు. స్థలంలోపల ప్రహరీ గోడలు, ఫెన్సింగ్‌తో పాటు చెట్లపై కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. కరెంట్ సరఫరా లేకున్నా సీసీ కెమెరాలు పనిచేసేలా కొన్ని సీసీ కెమెరాలకు సోలార్ ప్యానెల్స్ సైతం ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తించిన రెవెన్యూ సిబ్బంది షాక్‌కు గురయ్యారు. స్థలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్ ద్వారా అనుసంధానించుకుని నిరంతరం చుట్టుపక్కల ఎవరైనా వస్తున్నారా అనే విషయంపై నిఘా వేస్తున్నారని, బయటి వారు స్థలంవద్దకు రాగానే సీసీ కెమెరాల్లో గుర్తించి ప్రైవేటు వ్యక్తులతో బెదిరింపులకు దిగుతున్నారని తేలింది. ప్రభుత్వ స్థలంలోపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించిన రెవెన్యూ అధికారులు, స్థలంలోకి ఎవరూ ప్రవేశించకుండా గేటుకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఎవరైనా లోనికివస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు.

డయాగ్నస్టిక్స్‌తో సత్వర వైద్యం

ఫలించిన కేసీఆర్ దూరదృష్టి.. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అడుగులు

పేదలకు వరంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్
134 పరీక్షలను అందుబాటులోకి తెచ్చిన నాటి కేసీఆర్ సర్కార్
గ్రేటర్ పరిధిలో 8000కు పైగా టెస్టులు

సిటీబ్యూరో, మే16, (నమస్తే తెలంగాణ): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. వేలకు వేలు పెట్టి పరీక్షలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న రోగులకు తెలంగాణ డయాగ్నస్టిక్స్ వరంగా మారింది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యంతో పాటు, పరీక్షలు కూడా అందించేందుకు 2018లోనే కేసీఆర్ సర్కార్ ముందడుగు వేసింది. నాటి కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా పేద ప్రజలకు ఉచితంగా రక్త, మూత్ర పరీక్షలు, థైరాయిడ్, లివర్, కిడ్నీ, హార్మోన్, క్యాన్సర్ స్క్రీనింగ్, ఈసీజీ, ఆల్ట్రాసౌండ్, మామోగ్రాం వంటి 134 రకాల పరీక్షలు నిర్వహిస్తుండటం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)పరిధిలో ఉన్న సుమారు 476 బస్తీ దవాఖానలు, యూపీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులకు వివిధ రకాల రోగాలతో వచ్చేవారి నుంచి అవసరమైన పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించి నారాయణగూడ ఐపీఎంలో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌కు పంపిస్తున్నారు. ఇందులో బయోకెమిస్ట్రీలో 56 పరీక్షలు, పాథాలజీలో 37, మైక్రోబయాలజీలో 41 రకాల పరీక్షలు నిర్వహిస్తుండటం గమనార్హం. ప్రతిరోజు 476 ఆసుపత్రుల నుంచి 8000కు పైగా శాంపిల్స్ వస్తుండగా, ఏడాదికి 13లక్షల మంది ఉచిత పరీక్షలు చేయించుకుంటున్నారు.

*నారాయణగూడ*కు చెందిన శ్రీనుకు రక్తకణాలు తగ్గడంతో దగ్గరలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో చేరాడు. వెంటనే వైద్యులు రక్తపరీక్షల కోసం శాంపిల్స్ సేకరించి టెస్టుల కోసం నారాయణగూడ ఐపీఎంలో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌కు పంపించారు. అందులో రూపాయి ఖర్చు చేయకుండానే అవసరమైన పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందించారు.

*సనత్ నగర్*లో ఉండే హసీనా థైరాయిడ్ సమస్యతో బాధపడుతోంది. ప్రైవేట్‌లో టెస్టులు చేయించుకునే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల సలహా మేరకు తెలంగాణ డైయాగ్నోస్టిక్స్‌లో టెస్టులు చేయించుకుంది. రూపాయి కట్టకుండానే 24 గంటల్లోపే రిపోర్టులు పొందింది.

బీఆర్ఎస్ పాలనలోనే ఉచితంగా ..

కేసీఆర్ దూరదృష్టి పేదలకు వరంగా మారింది. సామాన్యులు వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే జిల్లా ఆసుపత్రి లేదా అందుబాటులో ఉన్న ప్రైవేట్ డయాగ్నస్టిక్స్ కు వెళ్లేవారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు పరికరాల కొరత కారణంగా తిరిగి చేతినుంచి డబ్బులు పెట్టి ప్రైవేట్‌లోనే చేయించుకునేవారు. బీఆర్ఎస్ పాలనలోనే ఉచితంగా పరీక్షలు సామాన్యుల చెంతకు చేరడం విశేషం.

ముంపుపై ప్రణాళికేదీ..?

ముంచుకొస్తున్న అకాల వర్షాలు

నిర్లక్ష్యం వీడని జీహెచ్ఎంసీ
ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు వస్తాయన్న సూచనలు బేఖాతర్
ప్రతిపాదనల దశలోనే కాలయాపన
25లోగా ఖరారు కావాల్సిన మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్

టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
ఇంజినీరింగ్ విభాగంపై తీవ్ర విమర్శలు

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): ఒకవైపు అకాల వర్షాలు..మరోవైపు ముంచుకొస్తున్న ముందస్తు వర్షాలు..అయినా జీహెచ్ఎంసీ నిర్లక్ష్యాన్ని వీడడం లేదు.. ముందస్తు ప్రణాళికలతో వరద ముంపు లేకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పటికే కొన్ని చోట్ల పడుతున్న అకాల వర్షాలతో మునిగిపోతున్న కాలనీలు, రహదారులపై ఏరులై పారుతున్న వరద నీరు..పొంగిపొర్లుతున్న నాలాలు.. వాస్తవంగా ఇప్పటి వరకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ ఖరారు కావాల్సి ఉంది.. ఈ నెల 25 లోగా సర్కిళ్ల వారీగా మాన్‌సూన్ యాక్షన్ బృందాలు వర్షాకాల విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిద్ధం కావాల్సి ఉంది. ఇటీవల కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన ఇంజినీరింగ్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది.

కొరవడిన ముందస్తు ప్రణాళిక..

ఈ నెల చివరి వారం నాటికల్లా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాల్సిన అధికారులు ప్రతిపాదనలు రూపొందించడంలో తాత్సారం చేస్తున్నారు. ప్రతి ఏటా దాదాపు రూ.33 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ఇందుకు సంబంధించి పనులకు టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఏరియాల వారీగా 140 బృందాలు, ప్రత్యేక వాహనాలు, స్టాటిక్ లేబర్స్, మినీ మొబైల్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఐఆర్టీ పనులకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇటీవల కమిషనర్ మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని ఆదేశించిన ఇప్పటి వరకు పురోగతి లేకపోవడం ఇంజినీరింగ్ అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

కార్యాచరణలో అదే నిర్లక్ష్యం..

వర్షాకాల విపత్తును ఎదుర్కొని ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధం కావాలి. ఐతే గతేడాది ఐఆర్టీ బృందాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చేశారు. జూలై వరకు ఎమర్జెన్సీ బృందాలను సిద్ధం చేయలేదు..ప్రధానంగా ఈ పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.. పెండింగ్ బకాయిలు రూ. 1400 కోట్లు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని తేల్చి చెప్పడంతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ టెండర్లు స్పందన లేకపోవడంతో జాప్యం జరిగింది. గత అనుభవాలతోనైనా అధికారులు ఈ ఏడాది ముందస్తుగా కార్యాచరణలో అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కాంట్రాక్టర్లు సైతం ఇప్పటి వరకు పెండింగ్ బకాయిల క్లియరెన్స్ చేయలేదని, జూన్ నాటికల్లా రూ.400 కోట్ల మేర బకాయిలు చెల్లిస్తారని చెప్పారే తప్ప ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

మొక్కుబడిగా సమీక్షలు

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌పై జీహెచ్ఎంసీ మొక్కుబడి సమీక్షలతో సరిపెడుతున్నది. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీ-సిల్టింగ్ పనుల పురోగతి, వాటర్ లాగిన్ పాయింట్లు, వర్షాలతో సంభవించే సంక్షోభ పరిస్థితుల పరిష్కారం పై పూర్తిస్థాయి నివేదిక రూపొందించాల్సింది కమిషనర్ పలు శాఖలకు దిశా నిర్దేశం చేశారు. ట్రాఫిక్ డీసీపీ జోయల్ , జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు వచ్చేనా..!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో లక్షల్లో దరఖాస్తులు

1275 ఇండ్లు మాత్రమే మంజూరు
ఆందోళనలో దరఖాస్తుదారులు

మేడ్చల్, మే16(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇంటి పథకంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండో విడతలో 967 ఇండ్లను మాత్రమే మంజూరు చేయడంతో దరఖాస్తుదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతలో 308 ఇండ్లను మంజూరు చేసిన విషయం విదితమే. రెండో విడతలో అర్హులైన వారందరికీ ఇండ్లను మంజూరు చేస్తారని భావించిన దరఖాస్తుదారులకు నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లకు ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించి 16 నెలలు గడిచిన పథకాన్ని అమలు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్ల మంజూరుకు సంబంధించి జాబితా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతి తప్పనిసరిగా ఉండాల్సిందే. అయితే మంజూరు చేసిన ఇండ్లలో అర్హులు ఎంత మంది ఉన్నారో అన్న అనుమానాలు దరఖాస్తుదారులను వేధిస్తుంది.

సర్వే పేరిట కాలయాపన..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ పథకానికి లక్షా 42 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు మొదటి, రెండో విడత కలిపి 1,275 మాత్రమే ఇండ్లు మంజూరయ్యాయి. మళ్లీ దరఖాస్తుల సర్వే పేరిట మరింత కాలం కాలయాపన చేసే అవకాశం ఉందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో సర్వే జరిగింది కానీ మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఇంకా సర్వేను ప్రారంభించనే లేదు.